సాక్షి విశాఖపట్నం

సోమవారం ; 27 ; మార్చి ; 2023



ముగిసిన వైజాగ్ గాట్ టాలెంట్

జీ-20 సదస్సు నేపథ్యంలో వైజాగ్ గాట్ టాలెంట్ పేరుతో నిర్వహించిన వేదిక కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. 8లో



వాల్ చూపులు.. మెరుపులు

విశాఖ అందమైన నగరం..జీ-20 సదస్సు నేపథ్యంలో మరింత సింగారించుకుంది. ఓ రేంజ్‌లో విశాఖ వెలిగిపోతోంది. 8లో



రవాణాలో 'వాల్తేరు' రికార్డు

వాల్తేర్ డివిజన్ ఈ ఆర్థిక సంవత్సరంలో నరకు రవాణాలో రూ.9వేల కోట్ల రికార్డు స్థాయి రెవెన్యూ సాధించింది. 8లో

విశాఖపట్నం
ఇఫ్తార్ (సోమ) సహర్ (మంగళ)
6:13 4:40
రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

వైఎస్సార్ 'సీ వ్యూ' ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు విడదల రజని, సురేష్, అమర్‌నాథ్

ఆరిలోవ(విశాఖ తూర్పు): జీ-20 సదస్సు కోసం బీచ్‌రోడ్డును సుందరంగా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా సీతకొండ వద్ద సీ వ్యూ పాయింట్ నిర్మించారు. దీనికి వైఎస్సార్ సీ వ్యూ పాయింట్‌గా నామకరణం చేశారు. ఈ వ్యూ పాయింట్‌ను మంత్రులు ఆదిమూలపు సురేష్, విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేసిన ఐ లవ్ వైజాగ్, సోలార్ దీపాలు, కొండవాలులో రాళ్లపై పెయింటింగ్ ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. సుమారు రూ.2.4 కోట్ల నిధులతో 250 మీటర్లు పొడవున సీ వ్యూ పాయింట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్యాటకులు సముద్రంలో విహరించే విధంగా బోటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, 9వ వార్డు కార్పొరేటర్ స్వాతి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం

- నేటి నుంచి కరోనా పరీక్షలు
- యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో ఏర్పాట్లు



మహారాణిపేట : దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి కరోనా పరీక్షల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. రోజుకు 50 పరీక్షలు చేయాలని ప్రభుత్వం ఆదేశాల జారీ చేసిందని, అందులో భాగంగా సోమవారం నుంచి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాపిడ్ పరీక్షలు చేస్తామన్నారు. 63 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీ), 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పీహెచ్‌సీ) పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జ్వరం, దగ్గు, ఆయాసం లక్షణాలు కలిగిన వారు సమీప యూపీహెచ్‌సీలో గాని, పీహెచ్‌సీలో గాని పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ రాపిడ్ పరీక్షల్లో కరోనా నిర్ధారణ అయితే వారికి తదుపరి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

3 నుంచి ఈకోర్స్‌లో వేసవి క్రీడా శిబిరాలు

విశాఖ స్పోర్ట్స్: ఈకోర్స్ వాల్తేర్ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి మే నెలాఖరు వరకు నిర్వహించనున్నారు. ఐదేళ్ల నుంచి పదిహేనేళ్ల చిన్నారులకు అథ్లెటిక్స్‌తో పాటు బాక్సింగ్, బాస్కెట్‌బాల్, క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, స్కేటింగ్, స్విమ్మింగ్, టీటీ, టెన్నిస్, వాలీబాల్ క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి మాట్లాడుతూ వేసవి క్రీడా శిబిరాలను ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రికెట్, స్విమ్మింగ్, టెన్నిస్ క్రీడాంశాల్లో శిక్షణ నిబంధనల మేరకు ఎంపిక ఉంటుందన్నారు. శిబిరాల్లో పాల్గొనేందుకు తమ ఎంట్రీలను రైల్వేస్టేడియంలో నమోదు చేసుకోవచ్చన్నారు.

నేటి స్పందన రద్దు

మహారాణిపేట/దాబాగార్డెన్స్: జీ-20 సదస్సు నేపథ్యంలో సోమవారం స్పందన రద్దు చేసినట్టు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని పేర్కొన్నారు. అలాగే సోమవారం జరగాల్సిన స్పందన, డయల్ యువర్ మేయర్ కార్యక్రమాలు రద్దు చేసినట్టు కమిషనర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. సదస్సు ఏర్పాట్లలో అధికారులు ఉన్నందున ఆయా కార్యక్రమాలు రద్దు చేశామని, నగర ప్రజలు సహకరించాలని కోరారు.

జీ-20 జోష్



కార్నివాల్.. కెవ్వు కేక

బీచ్‌రోడ్డు: తెలుగు వైభవం చాటేలా సాగరతీరంలో ఆదివారం నిర్వహించిన కార్నివాల్ అద్భుతంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన సందర్శకులు, పర్యాటకులతో బీచ్‌రోడ్డు జనసంద్రంగా మారింది. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు సాగిన ఈ కార్నివాల్‌తో బీచ్‌రోడ్‌లో పండగ వాతావరణం నెలకొంది. జీ-20 సదస్సు నేపథ్యంలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు జీవీఎంసీ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్నివాల్.. మన సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పింది. వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు కూచిపూడి, భరత నాట్యంతో అలరించారు. అరకు థింసా, బుట్టబొమ్మలు, కోలాటం, భామా కలాపం, వీర నాట్యం వంటి సంప్రదాయ నృత్యాలు అదరహో అనిపించాయి. యువతీ యువకులు దేశ భక్తి గీతాలకు తమదైన శైలిలో నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. పులి వేషాలు, కొమ్ము నృత్యాలు, తప్పెటగుళ్లు, కాళికా వేషాలు, బిందెల డ్యాన్స్, డప్పు వాయిద్యాలు, సాము గారడీలు, తదితర ప్రదర్శనలతో కళాకారులు సందర్శకులను మైమరపింపజేశారు. చిన్నారుల ఫ్యాషన్ షో,స్కేటింగ్ చేస్తూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జీ-20 దేశాల జాతీయ జెండాలను ప్రదర్శించారు. ముందుగా ఈ కార్నివాల్‌ను రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గిరిజనులతో కలిసి నృత్యం చేశారు. కార్నివాల్‌లో విదేశీయులు సైతం వివిధ వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డిప్యూటీ మేయర్ జి.శ్రీధర్, మున్సిపల్ శాఖ స్పెషల్ సెక్రటరి శ్రీలక్ష్మి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.



కొమ్ము నృత్య కళాకారులతో మంత్రులు అమర్‌నాథ్, సురేష్





అలరించిన చిన్నారుల నృత్యం



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విదేశీ మహిళల నృత్యం



మారథాన్.. అదిరెన్



పారాగ్లైడింగ్ ప్రారంభిస్తున్న మంత్రులు రజని, సురేష్, అమర్‌నాథ్



ఉత్సాహంగా పరుగు



నేను సైతం.. మారథాన్‌లో పాల్గొన్న వృద్ధుడు

బీచ్‌రోడ్డు: జీ-20 సదస్సుతో విశాఖకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని అన్నారు. జీ-20 సదస్సు నేపథ్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో ఉత్సాహంగా మారథాన్ జరిగింది. ఆర్.కె.బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద రాష్ట్ర మంత్రులు విడదల రజని, ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్ జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీ-20 సదస్సుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 3కె, 5కె, 10కె విభాగాల్లో పరుగు పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ మారథాన్‌లో పెద్ద సంఖ్యలో నగరవాసులు, ముఖ్యంగా యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. విశాఖను ప్రపంచ పటంలో ప్రముఖ నగరంగా నిలపాలన్నది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమన్నారు. ఇందులో భాగంగా ఈ నెల మొదటి వారంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు విశేష స్పందన లభించిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఒప్పందాలు కుదుర్చుకున్నారని వెల్లడించారు. 200 మందికి పైగా అతిథులు పాల్గొనే జీ-20 సదస్సులో ఈ నెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ఈ సదస్సుకు హాజరవుతున్న వారిని ఆకట్టుకునేలా రూ.157 కోట్లతో నగర సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, పోలీసు కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్

జీ-20 జెండాతో కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్ తీరం చుట్టూ చక్కర్లు కొట్టింది. సుమారు 30 నిమిషాల పాటు తీరంలో సందడి చేసింది. కోస్టల్ బ్యాటరీ నుంచి సాగరనగర్ బీచ్ వరకు నాలుగు రౌండ్లు వేసి సందర్శకులను ఆకర్షించింది.

సంగీతం ప్రశాంతత వైపు నడిపిస్తుంది

- ప్రముఖ సినీ సంగీత దర్శకుడు తమన్



స్టూడియో పరిశీలిస్తున్న సంగీత దర్శకుడు తమన్

ఏయూక్యాంపస్: వ్యక్తి మానసికంగా దృఢంగా మారడానికి సంగీతం సాధనంగా నిలుస్తుందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎస్.ఎస్ తమన్ అన్నారు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఏయూ-సెయింట్ లూక్స్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ అకాడమీలో రికార్డింగ్ స్టూడియో, డిజిటల్ క్లాస్‌రూమ్‌లను ఆదివారం వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో కలసి థమన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు నేలలో ఓ అద్భుత శక్తి ఉందని.. సంగీతానికి ఇక్కడి భాష, యాస ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందన్నారు. సంగీతం విద్యార్థుల్లో ప్రశాంతత అందిస్తుందన్నారు. తన తండ్రి వల్ల సంగీత దర్శకుడు ఆశీర్వాద్‌తో తనకు అనుబంధం ఏర్పడిందన్నారు. సుదీర్ఘ అనుభవం కలిగిన సంగీత దర్శకుడి మార్గనిర్దేశంలో విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. సాంకేతికంగా మార్పులు యువతకు అవకాశాలను సృష్టిస్తున్నాయని.. యూట్యూబ్, ఇన్‌స్టా రీల్స్ చేస్తూ ప్రాచుర్యం పొంది, సినీ అవకాశాలను అనేక మంది దక్కించుకుంటున్నారన్నారు. ఆరోగ్యంగా, యవ్వనంగా జీవించాలంటే సంగీతం వినడం, సాధన చేయడం మంచిదన్నారు. అనంతరం విద్యార్థుల కోరిక మేరకు నిన్నిలా..నిన్నిలా..చూశానే అనే పాట ఆలపించారు. విద్యార్థులు ఆయనతో గొంతు కలిపారు. వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ సంగీతాభిలాష కలిగిన విద్యార్థులకు ఈ అకాడమీ మంచి అవకాశం కల్పిస్తుందన్నారు. తొలి దశలో దాదాపు 3.5 కోట్ల వ్యయంతో స్టూడియో, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నూతన విద్యా విధానంలో పేర్కొన్న విధంగా మల్టీ డిసిప్లీనరీ విశ్వవిద్యాలయంగా ఏయూను నిలుపుతున్నామన్నారు. అనంతరం వర్సిటీ తరఫున తమన్‌ను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు ఆశీర్వాద్ లూక్స్, సెయింట్ లూక్స్ విద్యా సంస్థల చైర్మన్ ప్రీతం లూక్స్, ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఆచార్య సరస్వతి విద్యార్థి, ఆచార్య ఎ.కె.ఎం పవార్, ఆచార్య టి.షారోన్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య బృందాలు రెడీ

మహారాణిపేట: జీ-20 సదస్సు నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వైద్య బృందాలను సిద్ధం చేసింది. ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగే జీ-20 సదస్సుకు 41 దేశాల నుంచి 200 మంది డెలిగేట్లు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్, ప్రభుత్వ వైద్య బృందాలు సిద్ధం చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 27 నుంచి 31వ తేదీ వరకు విశాఖ విమానాశ్రయం, రాడిసన్ బ్లూ హోటల్ వద్ద అపోలో, ప్రభుత్వ వైద్య బృందం సేవలందిస్తుందని చెప్పారు. ప్రతినిధులు సందర్శించే ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాల్లో అంబులెన్స్‌లు, వైద్యులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అపోలో ఆస్పత్రిలో 10, కేజీహెచ్ ఐసీయూలో 20 పడకలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఒక వైద్య బృందంలో వైద్యులు, నర్సులు, పారా మెడికల్ స్టాఫ్, అత్యవసర వైద్య పరికరాలు ఉంటాయని.. కరోనా కిట్లు కూడా అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

వావ్.. బస్టాప్



దాబాగార్డెన్స్: జీ-20 సదస్సు నేపథ్యంలో నగర సుందరీకరణలో భాగంగా ఆంధ్రా యూనివర్సిటీ బస్టాప్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్దారు. వన్ ఎర్త్.. వన్ ఫ్యామిలీ.. వన్ ఫ్యూచర్ పేరిట జీ-20 సదస్సు ప్రాముఖ్యం, ఆజాద్ కా అమృత్ మహోత్సవ్, జస్ట్ సే నో ప్లాసిక్, జగనన్న స్వచ్ఛ సంకల్పం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌తో కూడిన చిత్రపటాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. చినవాల్తేరు వైపు ఏర్పాటు చేసిన ఈ బస్టాప్ అటువైపు వెళ్లేవారిని ఆకర్షిస్తోంది.

2,500 మందితో 'జీ-20'కి బందోబస్తు

- విదేశీ అతిథులను గౌరవించడం మన బాధ్యత
- సదస్సు విజయవంతానికి ప్రజలు సహకరించాలి
- నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ పిలుపు





జీ-20 సదస్సుకు డ్రెస్ కోడ్‌తో సిద్ధమైన సిబ్బంది



మేము రెడీ అంటున్న రోప్ పార్టీలు

అల్లిపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జీ-20 సదస్సుకు 2,500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు కల్పిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ వెల్లడించారు. బందోబస్తులో 1,850 సివిల్ పోలీసులు, 400 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు, 4 గ్రే హౌండ్స్ యూనిట్లు, 2 క్యూఆర్‌టీ టీమ్‌లు, 6 స్పెషల్ పార్టీలు, 2 ఏపీఎస్పీ ప్లాటూన్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఆదివారం విలేకరులకు ఈ వివరాలు వెల్లడించారు. సదస్సు వేదిక వద్ద సిబ్బంది ధరించాల్సిన యూనిఫాం, అధికారులు, సిబ్బంది పాటించాల్సిన నియమాలు, ట్రాఫిక్, ఇతర విధుల నిర్వహణలో ఇప్పటికే పలు సూచనలు చేశామన్నారు. అంతర్జాతీయస్థాయిలో విధులు నిర్వహించే విధానాలపై ఇప్పటికే అనుభవజ్ఞులైన వారితో ప్రత్యేక తరగతులు ద్వారా అధికారులకు తెలియజేశామన్నారు. సిబ్బంది, అధికారులు తమ విధులను పూర్తి నిబద్ధతతో నిర్వర్తించాలని ఆదేశించారు. అతిథులు నగరంలో పర్యటించే ప్రాంతాల్లో పర్యాటకులకు ప్రవేశం లేదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. ప్రజలు, సదస్సుకు హాజరయ్యే వారికి ట్రాఫిక్‌లో అసౌకర్యం, అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. 28, 29, 30 తేదీల్లో రాడిసన్ బ్లూ హోటల్ పరిసర ప్రాంతాలు, బీచ్‌రోడ్డు, ఇతర జంక్షన్లు రద్దీగా ఉండే అవకాశం ఉన్నందున నగరవాసులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎయిర్‌పోర్టు, తాటిచెట్లపాలెం, వేమన మందిరం, సిరిపురం, సీఆర్ రెడ్డి జంక్షన్, పార్క్ హోటల్, కురుపాం జంక్షన్, రాడిసన్ బ్లూ హోటల్ వరకు ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించి.. ట్రాఫిక్ పోలీసులు నిర్దేశించిన ప్రాంతాల్లో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సిటీకి చేరుకున్న పోలీసులు

జీ-20 సదస్సు బందోబస్తుకు శ్రీకాకుళం, పార్వతీపురం ప్రాంతాల నుంచి పోలీసులు ఆదివారం పోలీస్ బ్యారెక్స్‌కు బస్సుల్లో తరలివచ్చారు. అక్కడ నుంచి వారికి కేటాయించిన స్థలాల్లో విధులు నిర్వహించేందుకు వెళ్లారు.

హార్బర్ ఆధునికీకరణకు అంకురార్పణ!

- నెట్‌మెండింగ్, వాటర్ ట్యాంక్, పార్కింగ్ పనులకు శ్రీకారం
- రూ.151.82 కోట్ల వ్యయంతో మారనున్న రూపురేఖలు
- మత్స్యకారుల అభ్యర్థనతో డీపీఆర్‌లో స్వల్ప మార్పులు
- త్వరలో ఫ్లోటింగ్ జెట్టీల నిర్మాణానికి టెండర్లు



విశాఖ ఫిషింగ్ హార్బర్

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో ఆధునికీకరణ పనులు మొదలయ్యాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రపంచ శ్రేణి ఓడరేవుగా రూపాంతరం చెందబోతోంది. ఇన్నాళ్లూ తగినంతగా నాణ్యతా ప్రమాణాలు, సదుపాయాలు లేకపోవడంతో ఇక్కడ నుంచి చేపలు ఆశించిన స్థాయిలో ఎగుమతులు జరగక చేపలకు మంచి ధర లభించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ హార్బర్ ఆధునికీకరణకు సాగరమాల పథకంలో పీఎం మత్స్య సమృద్ధి యోజన కింద రూ.151.81 కోట్లు మంజూరైన సంగతి తెలిసిందే. ఇటీవల ఈ పనులకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో హార్బర్‌లోని ప్లాట్‌ఫాంల మరమ్మతులు, రెండు పెద్ద ఎయిర్ కండిషన్డ్ ఆక్షన్ హాలు, మత్స్యకారులకు విశ్రాంతి గదులు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, క్యాంటీన్, వాహనాల పార్కింగ్, చేపల రిటైల్ అమ్మకం షాపులు, నెట్ మెండింగ్ హాలు, కోల్డ్ స్టోరేజిలు, అత్యవసర ఫైర్ సబ్‌స్టేషన్ వగైరా ఏర్పాటు చేస్తారు. విడిగా ప్యాకింగ్ షెడ్, ఆటోమేషన్, లోడింగ్, అన్‌లోడింగ్ బే, డార్మిటరీలు, ఫుడ్‌కోర్టు, ఆర్వో ప్లాంటు, పెద్ద చేపల ఎగుమతికి వీలుగా కన్వేయర్ బెల్ట్ వంటివి కూడా అందుబాటులోకి వస్తాయి. చేపలను ఎండబెట్టడానికి 20 మెకానికల్, 10 సోలార్ డ్రయర్లు, అంతర్గత రోడ్లు ఏర్పాటవుతాయి. హార్బర్ ఆధునికీకరణలో కీలకమైన డ్రైనేజీ వ్యవస్థను కూడా మెరుగుపరచనున్నారు.

డీపీఆర్‌లో స్వల్ప మార్పులు

మత్స్యకారులు, బోటు యజమానుల అభ్యర్థన మేరకు డీపీఆర్‌లో స్వల్ప మార్పులు చేశారు. ముందుగా ప్రతిపాదించిన 3,4,5 జెట్టీలకు బదులు జీరో జెట్టీకి సమాంతరంగా ఒక ఫ్లోటింగ్ జెట్టీ, చేపల వేలం, ప్యాకింగ్ ప్రాంతంలో కట్టడాలను తొలగించి కొత్తగా జెట్టీని నిర్మించనున్నారు. బుక్కా కెనాల్ వద్ద ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న అసోసియేషన్ భవనాల స్థానంలో ఏసీ ఆక్షన్ హాళ్లు నిర్మించనున్నారు. అత్యవసరంగా బోట్ల మరమ్మతులకు డాక్ ఫెసిలిటీని సమకూరుస్తారు.

మొదలైన ఆధునికీకరణ పనులు

మత్స్యకారులు వలలు కుట్టే నెట్ మెండింగ్ హాలు, వాటర్ ట్యాంకు పనులు, పార్కింగ్ ఫెసిలిటీ, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, అసోసియేషన్ల ఆఫీసు బేరర్ల భవనాల నిర్మాణ పనులు మొదలు పెట్టారు.

ఫ్లోటింగ్ జెట్టీలకు త్వరలోనే టెండర్లు పిలవడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆధునికీకరణ పనులు మొదలయ్యాయని, మిగిలినవి దశలవారీగా చేపడతారని జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు. ఏడాదిన్నరలోగా ఆధునికీకరణ పనులను పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు.

వాల్ చూపులు.. వైజాగ్ మెరుపులు



రైల్వేన్యూకాలనీ జంక్షన్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద అందంగా తయారైన గ్రీన్ బెల్ట్



రైల్వేస్టేషన్ రోడ్‌లో గోడలపై రూపుదిద్దుకున్న అందమైన జీ-20 దేశాల చిత్రపటాలు









తాటిచెట్లపాలెం/దాబాగార్డెన్స్: విశాఖ అందమైన నగరం..జీ-20 సదస్సు నేపథ్యంలో మరింత సింగారించుకుంది. ఓ రేంజ్‌లో విశాఖ వెలిగిపోతోంది. మొన్నటి వరకు ఓ లెక్క..అంతర్జాతీయ సదస్సు నేపథ్యంలో మరో లెక్క అన్నట్టు విశాఖ రూపురేఖలు మారిపోయాయి. జాతీయ రహదారి, వీఐపీ రోడ్, తాటిచెట్లపాలెం-రైల్వేస్టేషన్ రోడ్, ఫ్లై ఓవర్ రోడ్ లలో రహదారులు, రహదారులకిరువైపులా గోడలు మెరిసిపోతున్నాయి. ఈ ప్రాంతాలలో రహదారులకిరువైపులా గల గోడలపై జీ -20 సదస్సులో పాల్గొనే దేశాల జాతీయ జెండాలు, విశేషాలను తెలియజేసే విధంగా వాల్ పెయింటింగ్స్ వేశారు. మరో వైపు మన దేశ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసే కళల చిత్రాలను అబ్బుర పరుస్తున్నాయి. ఈ చిత్రాలు క్షుణ్ణంగా పరిశీలిస్తే పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు కచ్చితంగా 4 నుంచి 5 మార్కులు వచ్చే అవకాశం ఉంది. జీ-20 సదస్సులో పాల్గొంటున్న అర్జెంటీనా, బ్రెజిల్, చైనా, జర్మనీ, ఇండోనేషియా, జపాన్, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, భారత్, ఇటలీ, మెక్సికో, దక్షిణకొరియా, రష్యా, టర్కీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, దక్షిణాఫ్రికా, సౌదీ అరేబియా, యునైటెడ్ కింగ్‌డమ్, యూరోపియన్ యూనియన్ దేశాల పేర్లు, ఆయా దేశాల ప్రాముఖ్యత, ఆయా దేశాల జాతీయ పక్షి, జాతీయ జంతువులతో కూడిన చిత్రాలను గోడలపై అలరిస్తున్నాయి. అంతేకాకుండా ఆయా ప్రాంతాలు విద్యుత్ వెలుగుల్లో తళుక్కుమంటున్నాయి.

ముగిసిన వైజాగ్ గాట్ టాలెంట్

బీచ్‌రోడ్డు: జీ-20 సదస్సు నేపథ్యంలో నగరవాసుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వైజాగ్ గాట్ టాలెంట్ పేరుతో నిర్వహించిన వేదిక కార్యక్రమం ఆదివారంతో ఘనంగా ముగిసింది. రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్ ముగింపు వేడుకలకు హాజరయ్యారు. ఈ నెల 5వ తేదీ నుంచి ఆర్.కె.బీచ్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 500లకు పైగా ప్రదర్శనలు జరిగాయి. చిన్నారులు, కళాకారులు, విద్యార్థులు తమలోని ప్రతిభను ఈ వేదికపై ప్రదర్శించారు. ముగింపు వేడుకల్లో 38 ప్రదర్శనలు జరగ్గా.. నేవీ బ్యాండ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణంగా నిలిచింది. మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి, కలెక్టర మల్లికార్జున, కమిషనర్ రాజాబాబు పాల్గొన్నారు.

'జెనెటిక్'తో లండన్ ఐవీఎఫ్ ఒప్పందం



ఎంవోయూ కుదుర్చుకుంటున్న జెనెటిక్, లండన్ ఐవీఎఫ్ సంస్థలు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర) : జన్యు సంబంధిత సంతాన ఉత్పత్తి విశ్లేషణ ఆధారంగా ప్రత్యేక చికిత్సల కోసం విశాఖ లండన్ ఐవీఎఫ్‌తో జెనెటిక్ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఈ టెక్నాలజీ ద్వారా సంతానం లేని దంపతులకు అతి తక్కువ ఖర్చుతో చికిత్స అందిస్తామని ఐవీఎఫ్ స్పెషలిస్ట్, మేనేజింగ్ డైరెక్టర్ కె.చంద్రరెడ్డి తెలిపారు. జీనోమిక్ ఫెర్టిలిటీ అనాలసిస్‌లో ఆడవారికి, మగవారికి చేసే టెస్టుల ద్వారా సమస్యను గుర్తించి చికిత్స అందజేస్తామని తెలిపారు. నూతన కుటుంబ సృష్టి, వచ్చే తరాలలో వ్యాధుల బారిన పడకుండా ఉండే పిల్లలను అందించడం, కొత్త పరిశోధనలు చేయడం వంటి మూడు అంశాలలో ఈ ఒప్పందం చేసుకున్నట్లు చంద్ర రెడ్డి తెలిపారు. విశాఖతో పాటు కాకినాడ, రాజమండ్రిలలో కూడా తమ బ్రాంచ్‌లను విస్తరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జెనెటిక్ ఫౌండర్, చీఫ్ సైన్స్ ఆఫీసర్ డా.అనురాధ ఉడుముడి మాట్లాడుతూ కుటుంబపరమైన జన్యు సమస్యలపై పరిశోధనలు చేశామని, అన్నిరకాల మందులు అందరిలో ఒకేలా పనిచేయవని, కాబట్టి ఇన్ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడుతున్నవారికి ముందుగా జన్యుపరమైన పరీక్షలు జరిపి లోపాలను గుర్తించి టైలర్ మేడ్ చికిత్స అందజేస్తామని తెలపారు.

THE CHODAVARAM CO-OPERATIVE SUGARS Ltd, NO.B.1109, GOVADA
Chodavaram Mandal, Anakapalli District, A.P.

E-Procurement Tender Notice

E-Procurement to take-up Chemical Cleaning and Hydro Water Jet cleaning of 02 Nos. WIL Make Boilers each 50 Tones/ Hr Evaporation capacity of the Chodavaram Co-operative Sugars Limited, Govada, for item Nos. 1 & 2 through e-auction. The list of 1 & 2 items and Tender Document consisting of terms & conditions and specifications of each item can be viewed in www.apeprocurement.gov.in Tender ID No. 603223

Bid Document download starting	: Date & Time	: 26-03-2023 from 09-30 A.M.
Bid Document download end	: Date & Time	: 10-04-2023 upto 01-00 P.M.
Bid Document submission Closing	: Date & Time	: 10-04-2023 upto 04-00 P.M.
Financial Bid Opening	: Date & Time	: 11-04-2023 from 02-00 P.M.

Place : Govada
Date : 25-03-2023
MANAGING DIRECTOR

భీమునిపట్నం మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లి.
నెం. 2443, భీమునిపట్నం - 531 163
ఫోన్ నెంబర్లు : 08933-228234, 9642726662

ఎన్నికల ప్రకటన

భీమునిపట్నం మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లి. నెం. 2443. భీమునిపట్నం యొక్క ఖాళీ అగు ఇద్దరు డైరెక్టర్లకు తేది. 22-04-2023 శనివారం ఉదయం 8.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు భీమునిపట్నం మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లి., డోర్ నెం. 10-36-284, కృష్ణాకోలని బస్టాండ్ దగ్గర, భీమునిపట్నం ఆవరణలో ఎన్నికలు జరుపబడును.

ఎన్నికల ప్రక్రియ	: బిల్డింగ్ సొసైటీ కార్యాలయంలో
నామినేషన్ ఫారములు స్వీకరణ	: తేది.31.03.2023 శుక్రవారం ఉదయం 10.00 గం.ల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు
నామినేషనులు పరిశీలన	: తేది.01.04.2023 శనివారం ఉ॥ 11.00 గంటల నుండి
నామినేషనులు ఉపసంహరణ	: తేది.02.04.2023 ఆదివారం ఉ॥ 10.00 గం॥ల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు

పైన తెలిపిన విషయములు సంఘ మెంబర్లందరకూ ఇందు మూలముగా తెలియజేయడమైనది. తదుపరి సమాచారం సంఘం కార్యాలయం పనివేళలలో తెలుసుకోవలసిందిగా కోరడమైనది.

భీమునిపట్నం.
తేది. 27.03.2023

ఎన్నికల అధికారి
BMACBS Ltd., భీమునిపట్నం.

వీనుల విందుగా సినీ గీత్‌మాలా



సినీ గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

పీఎంపాలెం: శిల్పారామం ఆదివారం సాయంత్రం సినీగీతాల ఆలాపనతో మార్మోగింది. నగరంలోని టైమ్స్ ఆఫ్ ఇండియా గీత్‌మాలా ఎంటర్టైన్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వినాయక మూర్తికే శతకోటి ప్రణామాలు గీతంతో ప్రారంభమైంది. ప్రముఖ సినీ గాయని ఎస్.జానకి ఆలపించిన సిరిమల్లే పువ్వా.., బాల సుబ్రహ్మణ్యం జానకీ ఆలపించిన రవివర్మకే అందని అందానివో.. ఎన్నెన్నో జన్మల బంధం నీదీ నాదీ...., అందమే ఆనందం.. వంటి పాపులర్ తెలుగు పాటలతో పాటు యాదోంకి భారత్...., రూపుతేరా మస్తానా....,దిల్ క్యాకరే జబ్ కిసీసే.., మెదలైన సూపర్ హిట్ హిందీ పాటలతో కళాకారుల రక్తి కట్టించారు. పీబీ ఖాన్, లక్ష్మణ్, కవిత, సుజాత గీతాలు ఆలపించగా కార్యక్రమాన్ని స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

సిద్ధార్థ, జాగృతి విజేతలు



తెల్లపావులతో ఆడుతున్న సిద్ధార్థతో తలపడుతున్న శశ్విక్



వైభవ్‌తో వంశీ ఎత్తుకు పైఎత్తు

విశాఖ స్పోర్ట్స్: జిల్లా అండర్ 15 చదరంగం జట్టుకు రమణసిద్ధార్థ, కుమారి జాగృతి ఎంపికయ్యారు. జట్ల ఎంపిక పోటీల్లో భాగంగా బాలుర విభాగంలో సిద్ధార్థ ఆరుపాయింట్లతో తొలి స్థానంలో నిలవగా శ్రీవైభవ్, జ్ఞానప్రసూన్, సుసేన ఐదేసి పాయింట్లతో తర్వాత స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో జాగృతి నాలుగు పాయింట్లు సాధించగా నిధి, శ్రియ, సాహిత్యలహరి మూడేసి పాయింట్లతో తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు. ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో బీవీకే జూనియర్ కళాశాలలో ఆదివారం బాలురకు 6 రౌండ్లు, బాలికలకు 4 రౌండ్ల పాటు పోటీలు జరిగాయి. వీరంతా జిల్లా జట్లుగా స్టేట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనున్నారు.

కావలీర్స్ సీసీ విజేత



ట్రోఫీ అందుకుంటున్న కావలీర్స్‌సీసీ జట్టు

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ టీ20 క్రికెట్ ట్రోఫీని కావలీర్స్ సీసీ అందుకుంది. రైల్వే స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ఈకోర్సా వాల్తేర్ జట్టుపై ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఈకోర్సా జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసింది. శ్యామ్‌సుందర్ 74, దీపక్ 21 పరుగులు చేశారు. మునీష్ రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా కావలీర్స్ రెండే వికెట్లు కోల్పోయి 166 పరుగులతో విజయాన్నందుకుంది. హర్షవర్థన్ 65పరుగులతో నిలిచాడు. చంద్రమౌళి 56 పరుగులు చేశాడు. ఫైనల్స్ మ్యాచ్ బెస్ట్‌గానే గాక బెస్ట్ బ్యాటర్‌గానూ హర్షవర్థన్ నిలవగా... బెస్ట్ బౌలర్‌గా డేవిడ్‌రాజు నిలిచాడు. ప్లేయర్ ఆఫ్ టోర్నీగా పాండురంగరాజు నిలిచాడు. పోటీల ముగింపు కార్యక్రమానికి క్రికెట్ సంఘ ప్రతినిధులు జి.జె.జె.రాజు, పార్థసారథి హాజరై విజేలకు ట్రోఫీ అందించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహక కమిటీ ప్రతినిధులు సి.వి.ఆర్.మూర్తి, వై.వెంకటేష్, శ్రీనివాస్, డి.జగదీష్ పాల్గొన్నారు.

మేనకోడలిపై లైంగిక దాడి

పెదగంట్యాడ : మండలంలోని కండిపిల్లి వారి వీధిలో ఓ బాలికపై సొంత మేనమామ లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక బంధువుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కండిపిల్లి వారి వీధిలో వెంకటరమణ నివాసం ఉంటున్నాడు. అతని అక్క దుబాయ్‌లో ఉంటుంది. ఆమె కుమార్తె (13)ను భర్త పట్టించుకోకపోవడంతో మేనమామ తన ఇంట్లోనే ఆసరా కల్పించాడు. అదే వీధిలో వెంకటరమణ అన్నయ్యలు కూడా నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం వెంకటరమణ భార్య ఊరు వెళ్లింది. శనివారం రాత్రి బాలికను హౌసింగ్ బోర్డు కాలనీవైపు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. తరువాత బాలికను ఇంటి దగ్గర వదిలేసి బయటకు వెళ్లిపోయాడు. ఆ బాలిక ముభావంగా ఉండటంతో గమనించిన మరో ఇద్దరు మేనమామలు ఏమైందని అడగడంతో అసలు విషయం చెప్పింది. దీనిపై న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మేనమామలు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ 3 BHK 1560 SQ. Ft 5th Floor Fully Furnished Beach & Park Views From Balcony Behind Iscon Temple Beach Road Avail Bank Loan EMI. Ph : 77383 07234 [V- 775229]

■ Ready to Occupy, 2 BHK 5th Floor, 1150 Sft, North facing with fully Furnished Deluxe Flat with Car parking, 6 yrs. Old, Akkayyapalem, 80 Ft Rd. Ramachandra Nagar. Ph : 93919 56902, 87909 63867 [V- 10353]

LAND FOR SALE

■ For Sale 163 Acres Single-Bit prime Land, Clear Title, Road-facing. Close to Vijayawada - Nagpur Expressway, Excellent Environment for Living, Business and agriculture, High iron soil. Nawabpet(V), Chityala(M), Bhupalpally(D). Contact : 7675868777, 9390085828. info@amodagroup.com [HA-26365]

PLOT FOR SALE

■ అర్జెంట్ సేల్ భోగాపురం టోల్ గేట్‌కి 1 కి.మీ ముందు ప్రకృతి వెంచర్‌కి ఎదురుగా (RK టౌన్ షిప్) NH-5 ఆనుకొని 2వ ప్లాట్ 202 చ॥గ॥ ప్లాట్ నెం : 10. ఫోన్ : 98460 97979, 79959 24235 [V- 2446]

■ పెందుర్తికి 12 కి॥మీ॥ దూరంలో (మర్రిపాలెం) వెంటనే ఇల్లు కట్టుకొనే వీలుగా ల్యాండ్ కన్వర్షన్, 30 అ॥ రోడ్స్‌తో చ॥గ॥ కేవలం 6500/- మాత్రమే. Ph : 73964 46819. [V- 2438]

R/E WANTED

■ ప్రముఖ కార్పొరేట్ విద్యాసంస్థకు 1.25 ఎకరాల స్థలంలో 40,000 చ॥అడుగుల బిల్డింగ్ గాజువాక, కూర్మన్నపాలెం పరిసరాలలో లీజు పద్ధతిలో కట్టి ఇచ్చుటకు ఆసక్తిగలవారు సం॥ 91210 01779. [V-10357]

Services

CHANGE OF NAME

■ I, Chander Bhan S/o Ramesh Chander, R/o:D.No-06/06/02, Peetal Vidi, Chinna Waltair, Vishakhapatnam - 530017, AP. Have Changed My Name As "Chander Bhan Malhotra, S/o Ramesh Chander Malhotra" For Future Purpose. [HA-10394]

డిస్ట్రిబ్యూటర్స్ కావలెను

■ ఎక్కువధర మెషినుతోవచ్చే TDS, ఆల్కలైన్, AO, - ORPలతో కూడిన మంచి నీటిని చాలా తక్కువధర ప్రొడక్టుతో ప్రతిఇంటికీ ఇచ్చేందుకు డీలర్స్ కావాలి. ✆ 77993 57879 [O-759018]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 4197]

MARRIAGE SERVICE

■ హిందువులలో అన్ని కులములవారికి మొదట మరియు ద్వితీయ వివాహములు చూడబడును. స్వయంగా మేమే వచ్చి వధువు లేదా వరుడు యొక్క వివరములు తీసుకుంటాము. (షరతులు వర్తిస్తాయి). ఫోన్ : 89776 36485 [V- 10363]

T.V. REPAIR

■ SVS TV రిపేర్స్ : 83677 16961 LED, LCD, A/C, వాషింగ్ మిషన్స్, ఫ్రిజ్, మైక్రోఓవెన్, మీ ఇంటి వద్దనే స్పాట్ రిపేర్ చేయబడును. 25 సం॥ Ex, 5 సం॥ వారంటీ కలదు. [V-776910]

Wanted

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం॥ 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795283]

■ ఋషికొండలో పనిచేయుటకు లేడీ సెక్యూరిటీ సూపర్‌వైజర్ (ఇంటర్ or డిగ్రీ, 8hrs జనరల్ షిఫ్ట్, 16000/-rs), గార్డులు కావలెను. (8hrs, 15000/-rs). Ph : 88858 68111, 97051 56111 [V- 1790]

■ Wanted DTP / NET Operator. Part / Full Time. Attractive Salary. Sai Net, RTC Complex, Dwarakanagar, Vizag-16. Ph : 98482 81659, 90009 20204 [V- 1793]

■ OPDSS సెక్యూరిటీ సంస్థయందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతంతో పాటు PF+ESI సౌకర్యం కలదు. ఫోన్ : 90595 98586, 79811 56210 [V- 1794]

■ Training & 100% Job Assistance on any Software Developer. Open New Batches 3 Months Training Period. Qlf : Any Graduation. Ph : 78931 11605 [V- 2659]

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటివద్దనే ఉంటూ పార్ట్‌టైమ్ ఒక గంట చేతివ్రాత ద్వారా పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పు॥ కావలెను. వీక్లీ పేమెంట్స్. 77024 73949 [G-795255]

■ గ్లోబల్ సర్టిఫైడ్ కంపెనీ నందు గొప్ప అవకాశం. ఇంటి వద్ద చేస్తూ నెలకు 20 వేలు పైన సంపాదన, నిరుద్యోగులు, గృహిణులు, 18+ అందరూ అర్హులే. ✆ 90145 07028 [B-992]

■ శ్రీ పాండురంగ మెగా ఐస్ క్రీమ్ పార్లర్ (జ్యూస్ షాపు)లో పని॥ పాలకొల్లుటౌన్ లో పనిచేయుటకు హెల్పర్స్ యువకులు కావలెను. (ఫ్యామిలీ అయినా వసతి కలదు) జీతం+వసతి+భోజనం+ టిఫిన్+టీ ఫ్రీ. ఫోన్: 9346821376 [H-796746]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
దాబాగార్డెన్స్, జగదాంబ MVP కోలనీ, మద్దిలపాలెం	} 90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లుయెంజాపై అవగాహన



వైఎల్ నరసింహారావు దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: ప్రజా ఆరోగ్య వేదిక, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లుయెంజా, కోవిడ్‌పై అవగాహన సదస్సు జరిగింది. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ సత్యవరప్రసాద్, ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పి.జె. శ్రీనివాస్, పల్మనాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కె ఫణీంద్ర పాల్గొని మాట్లాడారు. హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లుయెంజా, కోవిడ్ నుంచి పూర్తిగా కోలుకున్నా.. వాటి లక్షణాలు ఉంటాయని చెప్పారు. ఊపిరితిత్తుల పైభాగంలో హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లుయెంజా ప్రభావం ఎక్కువగా ఉంటుంది కాబట్టి మరణాలు ఉండవన్నారు. అయితే దీన్ని నివారించడానికి కోవిడ్‌కి ఏ రకమైన జాగ్రత్తలు తీసుకున్నామో, అదే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జనావాసాలు గల ప్రాంతాల్లో మాస్కులు తప్పనిసరిగా ధరించాలన్నారు. జ్వరం వచ్చి తగ్గి.. మళ్లీ జ్వరం వస్తే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం అల్లూరి విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వైఎల్ నరసింహారావు, డాక్టర్ సత్య వరప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ ఐ.వాణి, పద్మ, పీఏపీ జిల్లా చైర్మన్ ఐకే శేషు, చంద్రమౌళి, వెంకట్రావు, జగ్గు నాయుడు, మణి తదితరులు పాల్గొన్నారు.

సరకు రవాణాలో 'వాల్తేరు' రికార్డు



డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): వాల్తేర్ డివిజన్ ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో ఐదు రోజులు మిగిలి ఉండగానే సరకు రవాణాలో రూ.9వేల కోట్ల రికార్డు రెవెన్యూ సాధించి మరో మైలురాయి చేరుకుంది. బ్లూచిప్ డివిజన్ అయిన వాల్తేర్ చరిత్రలో ఇదే అత్యుత్తమ రికార్డు. గత ఆర్థిక సంవత్సరం 2021-22లో వాల్తేర్ డివిజన్ రూ.8498.86 కోట్లు ఆదాయం ఆర్జించింది. వాల్తేర్ డివిజన్ గత ఆర్థిక సంవత్సరంలో 66.88 మిలియన్ టన్నుల సరకు రవాణా చేయగా, గత ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 25వరకు 1.24 మిలియన్ టన్నులు అధికంగా రవాణా చేసి రికార్డు సృష్టించింది. దీంతో మొత్తంగా 68.12 మిలియన్ టన్నులను రవాణా చేసినట్టయింది. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ కుమార్ సత్పతి మాట్లాడుతూ ఈ రికార్డు వాల్తేరు డివిజన్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదన్నారు. మిగిలి ఉన్న ఈ ఐదు రోజులలో మరింత కష్టపడి మరింత ఆదాయం చేకూర్చే దిశగా ప్రయత్నిస్తామన్నారు. అధికారులు, సిబ్బంది కృషి ఫలితంగా ఇది సాధ్యమైందన్నారు.

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి

కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ సంఘాలు



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

దాబాగార్డెన్స్: ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్రస్థాయి సంయుక్త సదస్సు జరిగింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ కన్వీనర్ రెడ్డి వెంకట్రావు అధ్యక్షతన ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఏపీఎన్జీవో అసోసియేషన్ సంయుక్తంగా సదస్సు నిర్వహించాయి. 2004 తర్వాత విధుల్లో చేరిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని సదస్సులో తీర్మానం చేశారు. కార్పొరేటీకరణను వ్యతిరేకించాలని, 8వ వేతన సంఘం ఏర్పాటు, కారుణ్య నియామకాలపై షరతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌జీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీకుమార్, సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ బీజేపీ ముసుగులో ఆర్ఎస్ఎస్ పాలన సాగిస్తోందని ఆరోపించారు. హిందుత్వాన్ని ఎవరు విమర్శించినా వారిపై ఉక్కుపాదం మోపుతోందన్నారు.

ఉద్యోగుల విషయంలో ప్రభుత్వాలు మితిమీరిన జోక్యం చేసుకోవడం తగదన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ఏఐఎస్‌జీఈఎఫ్ ఏపీ తెలంగాణ యూనిట్ ప్రధాన కార్యదర్శి ఎ.అజీజ్, కె.వి.శివారెడ్డి, వి.నాగేశ్వరరావు, ఎం.రాజ్యలక్ష్మి, పి.గోపాలకృష్ణ, పురుషోత్తమ నాయుడు, బి.శ్రీధర్‌బాబు, కె.మృదుల, శాంతిశ్రీ, ఎంవీ రమణారావు, పి.నాగేశ్వరరావు, ఆర్.శ్రీనివాస్, రతన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వీఎల్‌వో పోస్టుకు గజిటెడ్ హోదా

ఏపీఎన్‌జీవో అసోసియేషన్ డిమాండ్



మాట్లాడుతున్న ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు శ్రీనివాసరావు

ఆరిలోవ: పశు సంవర్ధక శాఖలో వీఎల్‌వో పోస్టుకు గజిటెడ్ హోదా కల్పించాలని ఏపీఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు కోరారు. డెయిరీఫారం వద్ద పశు సంవర్ధక శాఖ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి విశాఖతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి పలువురు పశు సంవర్ధక శాఖ ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి శ్రీనివారావు, ఏపీఎన్‌జీవీఎఫ్ చైర్మన్ బి.సేవా నాయక్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర కేబినెట్, అసెంబ్లీలో పారా వెటర్నరీ కౌన్సిల్‌కు ప్రభుత్వం ఆమోదం తెలపడం అభినందనీయమన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న వీఎల్‌వో పోస్టుకు గజిటెడ్ హోదా కల్పించాలని కోరారు. అసోసియేషన్ కార్యదర్శి కె.శివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, రాష్ట్ర ఎస్.ఎల్.ఎ అధ్యక్షుడు బోనం గోవిందరాజు, కోశాధికారి కోదండరావు, ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కార్నివాల్.. కెవ్వు కేక

జీ-20 సదస్సు నేపథ్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో నిర్వహించిన కార్నివాల్ ఆద్యంతం సందడిగా జరిగింది. వివిధ వేషధారణలో చిన్నారులు, పలు ప్రదర్శనలతో కళాకారులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మన సంస్కృతిని చాటిచెప్పారు.









